ప్రజాశక్తి

గురువారం 9 అక్టోబర్ 2025   8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

మంత్రి గొట్టిపాటిపై..

వైసిపి మరో రాజకీయ అస్త్రం



మంత్రి గొట్టిపాటి రవికుమార్

- అద్దంకిలో వరుస ఓటములు చవిచూసిన దిగ్గజాలు
- వైసిపి ప్రయోగం ఏ మేరకు సఫలమవుతుందన్నదే ప్రశ్న
- వైద్యులు అశోక్‌కుమార్‌కు అద్దంకి వైసిపి పగ్గాలు



డాక్టర్ అశోక్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ప్రస్తుత ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీనియర్ రాజకీయ దిగ్గజం..ఓటమి ఎరుగని నేత మంత్రి గొట్టిపాటి రవికుమార్‌పై వైసిపి మరో కొత్త రాజకీయ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. పల్నాడు ప్రాంతానికి చెందిన డాక్టర్ అశోక్‌కుమార్‌కు వైసిపి ఇన్‌చార్జిగా పగ్గాలు అప్పగించారు.వచ్చే ఎన్నికల్లో ఈయన్ను అభ్యర్థిగా బరిలోకి దింపేందుకు వైసిపి కసరత్తు చేపట్టింది. ఆయన కూడా నియోజకవర్గంలోకి రాజకీయ సాంప్రదాయకంగా హడావిడితో అడుగుపెట్టారు. కార్యకర్తలనుద్దేశించి ఆయన చెప్పాల్సిన మాటలూ చెప్పారు. ఆయన రాజకీయ భవిష్యత్‌ను అద్దంకిలో పరీక్షించుకునేందుకు తహతహలాడటం కనిపించింది.యువకుడుగా ఉన్న అశోక్‌కుమార్ గతంలో తెలుగుదేశంలోనే ఉన్నట్లు సమాచారం. అక్కడ పార్టీనేతలతో సర్దుబాటు కాలేకనే బయటకు వచ్చారని తెలిసింది. అదే సమయంలో వైసిపి ఆయన్ను గుర్తించి పార్టీలోకి ఆహ్వానించింది.

అద్దంకి నియోకవర్గంలో పార్టీ పగ్గాలు అప్పగించింది. మంత్రి గొట్టిపాటిపై వైసిపి ప్రయోగం ఇది కొత్తకాదు. నాలుగుసార్లు ఇక్కడ గెలిచిన రవికుమార్ ప్రతి ఎన్నికలోనూ కొత్త అభ్యర్థిపైనే తలపడ్డారు. అనూహ్యంగా గెలిచారు. అద్దంకి నియోజకవర్గంలో గడిచిన ఈ నాలుగుపర్యాయాలు రాజకీయ దిగ్గజాలే ఓటమిని చవిచూశారు. గొట్టిపాటిని ఢీకొట్టలేక చతికిలపడ్డారు. ఇప్పటికి ఐదుసార్లు వరుసగా గెలిచిన రికార్డు కూడా గొట్టిపాటి సొంతమైంది. అద్దంకి నియోజకవర్గంలోకి 2009లో గొట్టిపాటి అడుగుపెట్టాక ఇప్పటి వరకూ తిరుగులేని నేతగా చలామణి అవుతున్నారు. ఆక్కడ అంతకు ముందు అద్దంకి రాజకీయాలను శాసించిన కరణం బలరాం, బాచిన చెంచుగరటయ్య ఈ సీనియర్ దిగ్గజాలు గొట్టిపాటిపై ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరి రాజకీయ భవితవ్యం ఇక్కడ నుంచే ప్రారంభమైంది. 2009 నుంచీ గొట్టిపాటి రవికుమార్ ఆధిపత్యం నడుస్తోంది. ఆయన ఏపార్టీ నుంచీ పోటీ చేసినా విజయం వరించింది. ఇక్కడ ప్రత్యర్థి పార్టీలకు అభ్యర్థులే నిలకడగా ఉండలేని పరిస్థితి వచ్చింది. ఓడిపోయాక కనీసం ▶ 2లో

ఆకట్టుకున్న అంతరిక్ష ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ శ్రీహరికోట, ఇస్రో, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి షార్ డైరెక్టర్ పద్మకుమార్, అసోసియేట్ డైరెక్టర్ ముత్తుచెరియన్, క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ పద్మకుమార్ విద్యార్థులకు షార్, ఇస్రో పనితీరును వివరించారు. స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన విషయాలను సామాన్యులకు తెలిసే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అసోసియేట్ డైరెక్టర్ ముత్తుచెరియన్ మాట్లాడుతూ షార్, ఇస్రో ఇప్పటికే ఎన్నో అద్భుతమైన ప్రయోగాలు ▶ 2లో



ప్రదర్శనలు తిలకిస్తున్న షార్ డైరెక్టర్ పద్మ కుమార్

రైతుల సంక్షేమమే 'కూటమి' లక్ష్యం

- ఒంగోలు ఎఎంసి మరింత అభివృద్ధి చెందాలి
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- అట్టహాసంగా 'రాచగర్ల' ప్రమాణ స్వీకారం



రాచగర్ల వెంకట్రావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మరింతగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆకాంక్షించారు. ఒంగోలు ఏ1 కన్వెన్షన్ హాలులో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. తొలుత పూలతో అలంకరించిన వాహనంపై మంత్రి డిబివి స్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, ఎమ్మెల్యేలు, పాలకవర్గ సభ్యులతో ఆశీనులు కాగా నగరంలో కూటమి నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఒంగోలు మినీ స్టేడియం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఏ1 కన్వెన్షన్ హాలు వరకు సాగింది. ఒంగోలు ఏఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావుతో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల ప్రమాణం చేయించారు. ఒంగోలు ఏఎంసి వైస్ ఛైర్మన్ చిట్టెం వెంకట దుర్గా ప్రసాద్, కార్యవర్గ సభ్యులతో మార్కెటింగ్ శాఖ అధికారిణి ప్రమాణం చేయించారు. అనంతరం జరిగిన సభకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 ▶ 2లో



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

మైనింగ్ రాయల్టీ ప్రభుత్వమే వసూలు చేయాలి

ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

▶ 2లో

వాటర్ ప్లాంట్ బహూకరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు ప్రకాశం కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ బహుకరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన మంచినీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి (శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్) మాట్లాడుతూ సూర్యశ్రీ ట్రస్ట్ మానవతా దృక్పథంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ బ్రదర్స్ రెడీమేడ్ షోరూం అధినేత పవన్ సాయి మారెళ్ళ, సుబ్బారావు ప్రధానోపాధ్యాయులు కందులు హేమలత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అంతరిక్ష ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

చేసిందన్నారు. డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి దేవి మాట్లాడుతూ రెండోసారి క్విస్ కళాశాలలో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. అంతరిక్ష ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. వివిధ స్కూళ్లు, కాలేజీల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. క్విజ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, సీఎస్‌సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్, వరల్ట్ స్పేస్ వీక్-2025 ఒంగోల్ సబ్ కమిటీ ఛైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరీ ఆదిత్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటిపై.. వైసీపీ మరో రాజకీయ అస్త్రం

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌ఛార్జిగా కూడా ఉండలేకపోతున్నారు. క్రియాశీలకంగా సాగలేకపోతున్నారు. ఎత్తుకుపై ఎత్తులు వేసే శక్తిగల నేతలున్నా కూడా రాజకీయవ్యూహాల్లో చతికిలపడ్డారు. ప్రతికూలతను ఎదుర్కొన్నారు. కొందరు నియోజకవర్గాలు కూడా మార్చుకున్నారు. 2009 ఎన్నికల్లో సీనియర్ నేత కరణం బలరాంపై గొట్టిపాటి కాంగ్రెసు నుంచి పోటీచేసి గెలిచారు. 2014లో వైసిపి నుంచీ పోటీచేసి కరణం తనయుడు వెంకటేష్‌పై గెలిచారు. అనంతరం తెలుగుదేశంలో చేరిన గొట్టిపాటి రవికుమార్ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. సుమారు నాలుగేళ్లపాటు పార్టీలోనే అంతర్గత వైరుద్యాలను తట్టుకుని నిలబడాల్సి వచ్చింది. ఇక్కడ తనదేపైచేయిగా నిలిచింది. 2019 ఎన్నికల్లో అద్దంకి నుంచే మూడోసారి పోటీచేశారు. అప్పట్లో టిక్కెట్టు కోసంపెద్ద ఫైట్ నడిచినా చంద్రబాబు కూడా గొట్టిపాటికే కేటాయించారు. ఆ ఎన్నికల్లో మరో సీనియర్ నేత బాచిన చెంచుగరటయ్యను ఓడించారు. అధికారం లేనందున ప్రతిపక్షంలోనే క్రియాశీలకంగా సాగారు. గరటయ్య కుమారుడు చైతన్యకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆఖరులో టిక్కెట్టు ఇవ్వనందున ఆయన కూడా తెలుగుదేశంలో చేరారు. 2024 ఎన్నికల్లో నాలుగోసారి గొట్టిపాటి రవికుమార్ ఇక్కడ విజయం సునాయాసమైంది. వైసిపి నుంచి కొత్త అభ్యర్థి హనిమిరెడ్డిని బరిలోకి దించారు. ఆయన రాజకీయాలకు పూర్తిగా కొత్త. ఎన్నికల్లో ఓడిపోయాక నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఇపుడు కొత్త నేతగా డాక్టర్‌అశోక్‌కుమార్‌ను వైసిపి రంగంలోకి దించింది. సీనియర్ దిగ్గజం గొట్టిపాటిపై రాజకీయాల్లో ఓనమాలు దశలో ఉన్న అశోక్‌కుమార్ ఏ మేరకు పోటీనివ్వగలరు? అనేదీ చర్చ సాగుతోంది. ఈ నాలుగేళ్లు ఇక్కడ మంత్రి రాజకీయాలను తట్టుకుని నిలబడగలరా? మంత్రికి ప్రత్యర్థిగా రాణించగలుగుతారా? అనే చర్చ సాగుతోంది. అద్దంకి నియోజకవర్గంలో పోటి చేయాలనే ఆలోచనలో ఉన్న అశోక్‌కుమార్ కూడా తన రాజకీయ ప్రత్యర్థి గొట్టిపాటి బలమైన నేత అని గుర్తు చేశారు. మంత్రి శక్తిసామర్థ్యాలు ఆయన గమనంలోనూ లేవనుకోవడం పొరపాటే అవుతుంది. ఇంకా చెప్పాలంటే డాక్టర్ ఇక్కడ సాహసంతోనే వచ్చారని తెలుస్తోంది. కొద్ది రోజులు గడిస్తే ఆయన నడక ఏమిటనేది తెలుస్తుందనే చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. ఇక అద్దంకి నియోజకవర్గంలో వైసిపికి ఇప్పటి వరకూ నిలకడగా ఉండే నేత కరువయ్యాడు. కార్యకర్తల్లోనూ ఇదే ఉంది.ఇపుడు కొత్త నేత వచ్చినందున మళ్లీ వైసిపి కార్యక్రమాలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు. ఏదేమైనా మంత్రి గొట్టిపాటిపై రానున్న ఎన్నికల్లో డాక్టర్ అశోక్‌కుమార్‌కు కత్తిమీద సాములాంటిదేనని చెప్పకతప్పదు.

రైతుల సంక్షేమమే 'కూటమి' లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



ఏఎంసి ఛైర్మన్ రాచగర్ల, మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్ధన్‌లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వేలు అందజేస్తుందన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ 35 ఏళ్లుగా మాగుంట కుటుంబంతో ఏఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావుకు అనుబంధం ఉందన్నారు. ఒంగోలు ఏఎంసిని ప్రగతి పథంలో నడిపించాలని అందుకు తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు. గత ఎన్నికలలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు తప్పకుండా వస్తాయని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన సమయంలో పదవులు ఇస్తామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వ్యక్తి రాచగర్ల వెంకట్రావుకి ఏఎంసి ఛైర్మన్ పదవి దక్కటం సంతోషంగా ఉందన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ తనను నమ్ముకున్న వారికి పదవులు ఇప్పించటంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల ముందు ఉంటారన్నారు. రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ దామచర్ల కుటుంబంతో రాచగర్ల వెంకట్రావుకి 40 ఏళ్ళ అనుబంధం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజి మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల అనుభవం, సమర్ధత కలిగిన వ్యక్తి రాచగర్ల వెంకట్రావును ఒంగోలు ఏఎంసి ఛైర్మన్‌గా ఎంపిక చేశారన్నారు. రాష్ట్ర సాంస్కృతిక మిషన్ ఛైర్మన్ పొడపాటి తేజస్విని, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, టిడిపి యర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, జనసేన పార్టీ నాయకులు, రవిశంకర్ గ్రూపు అధినేత కంది రవిశంకర్, బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, నాయకులు యానం చిన్న యోగయ్య యాదవ్ ప్రసంగించారు. అనంతరం కొత్తకార్గ వర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఒంగోలు ఏఎంసి కార్యవర్గ సభ్యులు అతిథులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, ఒంగోలు ఏఎంసి మాజీ ఛైర్మన్లు సింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, టివి శ్రీరామమూర్తి, వై.శశికాంత్ భూషణ్, కూటమి నేతలు, మహిళా నాయకురాళ్ళు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నర్సింగ్‌లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నర్సులుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ హైఫా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లాలోని ముస్లిం, దూదేకుల, క్రిస్టియన్ మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08592-230169 లేదా 98499 01157 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

మైనింగ్ రాయల్టీ ప్రభుత్వమే వసూలు చేయాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

గ్రానైట్ మైనింగ్ రాయల్టీ వసూలు ప్రైవేటు సంస్థకు అప్పగించడాన్ని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఖండించింది. బుధవారం స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో సిఐటియు జిల్లా నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రానైట్ మైనింగ్ రాయల్టీ వసూలు ప్రైవేట్ సంస్థను అప్పగించడాన్ని రద్దుచేసి, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘ నాయకులతో చర్చలు జరిపి సమ్మెను నిర్వహింపచేయాలని కోరారు. సమ్మె వలన పనులు కోల్పోయిన కార్మికుల ఉపాధి కాపాడాలని, వలస కార్మికులను ఆదుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం నాయకులు దోమల పుల్లయ్య, అణగారిన కులాల ఐక్యవేదిక జేఏసీ అధ్యక్షుడు బండ్ల కొండలరావు, దళిత సేవా ఫౌండేషన్ సిహెచ్ ఎలమంద బాబు, గిరిజన సంఘం నాయకులు శ్రీకాంతు, ఆర్డిఎఫ్ వ్యవస్థాపకులు ఇస్తర్ల శంకర్, వృత్తిదారుల సంఘం మండల నాయకులు కొండయ్య, ఇట్టా నాగయ్య, టి.రామారావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన దామచర్ల సత్య

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజును రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య కలిసారు. ఎస్పీ కార్యాలయంలో దామచర్ల సత్య పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురూ పలు విషయాలు చర్చించుకున్నారు.



ఎస్పీతో దామచర్ల సత్య

కలెక్టర్‌ను కలిసిన సిడబ్ల్యూసి ఛైర్మన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ పి.రాజాబాబును ప్రకాశం జిల్లా బాలల సంక్షేమ కమిటీ, (సిడబ్ల్యుసి) ఛైర్‌పర్సన్ వేము రామాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ, పునరావాసం గురించి వివరించారు.



కలెక్టర్‌తో రామాంజనేయులు

వెంకయ్యనాయుడిని కలిసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి కలిశారు. బుధవారం నెల్లూరు స్వర్ణ భారతి ట్రస్ట్‌లో మర్యాద పూర్వకంగా కలిసిన ఒంగోలు ఎంపి మాగుంట పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా ఇరువురు విద్యార్థులను అభినందించారు.



వెంకయ్య నాయుడుతో ఎంపి మాగుంట

'మానవత' సేవలు విస్తరించాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్ : మానవతా సేవా సంస్థ సేవలు విస్తరించాలని వ్యవస్థాపక అధ్యక్షులు, కేంద్ర నియంత్రణ కమిటీ ఛైర్మన్ ఎన్.రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం అంజయ్య రోడ్డు బిసి భవన్‌లో సభకు సంస్థ ఛైర్మన్ మారెళ్ళ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రామచంద్రారెడ్డి మాట్లాడారు. సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ ఆర్.గోపి, సుబ్బిరెడ్డి, ఒమేగా రామిరెడ్డి, సెంట్రల్ కమిటీ కన్వీనర్ సోమిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

మాజీ మంత్రి సురేష్‌కు మన్నం వెంకయ్య సత్కారం

ప్రజాశక్తి-టంగుటూరు

మాజీ మంత్రి, పీఏసీ సభ్యులు, కొండపి నియోజక వర్గం సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన టంగుటూరు మండలం కందులూరు గ్రామానికి చెందిన యువ నాయకులు మన్నం వెంకయ్య మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. వైఎస్ఆర్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా మన్నం వెంకయ్యకు అవకాశం కల్పించినందుకు మాజీ మంత్రి సురేష్‌ను శాలువా కప్పి వెంకయ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఉప్పలపాటి రామరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణరాజు, దివ్యాంగుల యూనియన్ జిల్లా నాయకులు రాజేష్ పసుమర్తి, యువ నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న వెంకయ్య



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ప్రత్యేక తనిఖీలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు, జిల్లా పోలీసులు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా బుధవారం సాయంత్రం మార్కాపురం పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, పారిశ్రామిక వాడలోని పలు ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ (పేలుడు పదార్థాలు గుర్తించే జాగిలం రాక్సీ, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పాటు మార్కాపురం పోలీసు అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ పార్సిల్ ఆఫీస్, రాయవరం రైల్వే స్టేషన్, పారిశ్రామిక వాడ, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కాపురం సిఐ పి సుబ్బారావు మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీలో మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు ఎం సైదుబాబు, ఎస్ అంకమ్మరావు, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి వెంకటేశ్వర్లుకు 'అన్నా' నివాళి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని 6వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పొదిలి వెంకటేశ్వర్లుకు గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం దశ దిన కర్మ కార్యక్రమం సందర్భంగా వెంకటేశ్వర్లు నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కసిరెడ్డి వెంకటరమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, యక్కలి శేషగిరిరావు, జనసేన నాయకుడు శ్రావణి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-మర్రిపూడి: మర్రిపూడి మండల తహశీల్దార్ కార్యాలయనికి స్థానిక టీడీపీ యువనేత ప్రింటర్‌ను బహూకరించారు. స్థానిక టిడిపి యువ నాయకుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఉప్పు సాయిబాబు బుధవారం ప్రింటర్‌ను టిడిపి నాయకుల సమక్షంలో తహశీల్దార్ జనార్ధన్, ఆర్ఐ రాజశేఖర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు ప్రింటర్ దాత ఉప్పు సాయికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'కొండపి'కి 'వెలిగొండ' జలాలు

డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి స్వామి ఆదేశం

ప్రజాశక్తి-టంగుటూరు

వెలుగొండ జలాలు కొండపి నియోజకవర్గానికి తీసుకొచ్చేందుకు అవసరమైన డిపిఆర్ సిద్ధం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో మంత్రి స్వామి సమీక్షించారు. మంత్రి డాక్టర్ స్వామి కృషితో వెలుగొండ నుంచి పునుగోడు రిజర్వాయర్ ద్వారా కొండపి ప్రాంతంలోని పాలేరు పరివాహక ప్రాంతంలోని చెరువులకు 1.06 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల అనుమతులు ఇచ్చిందని అన్నారు. వెలుగొండ పూర్తయ్యాక ఆ నీటిని తూర్పు ప్రధాన కాలువ ద్వారా పునుగోడు రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు తీసుకొచ్చేందుకు డిపిఆర్ సిద్ధం చేయాలని మంత్రి స్వామి అధికారులను ఆదేశించారు.



జలవనరుల శాఖ అధికారులతో మంత్రి స్వామి సమీక్ష

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి: ఎంఈవో

ప్రజాశక్తి-శింగరాయకొండ

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు విద్యాతో పాటు క్రీడానైపుణ్యం మెరుగు పరుచుకుని ఉన్నత స్థాయిలో నిలవాలని శింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసులు, చెన్నిపాడు హెచ్ఎం ఎ వేణుగోపాల్‌రావు అన్నారు. బుధవారం పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 విభాగంలో బాలుర అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పించడం హర్షణీయమని అన్నారు. ప్రభుత్వాలు కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అకడమి క్ చదువులతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని అన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వేల్పుల వెంకట్రావు మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పించిన వనరులతో పాటు స్థానికంగా దాతల సహకారంతో క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని క్రీడాకారులను కోరారు. క్రీడాకారులకు సమయపాలన, కఠోర శ్రమ, క్రమశిక్షణ, పోటీతత్వం, క్రీడాస్ఫూర్తితో క్రీడాకారులు సాధన చేయాలన్నారు. ఈ పోటీలలో పొన్నలూరు మండలం చెన్నిపాడు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న క్రీడాకారుడు డబ్బుగొట్టు మనోహర్ 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆ విద్యార్థిని క్రీడాకారులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్య, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే మహాలక్ష్మి తదితరులు ఉన్నారు.



క్రీడల్లో పోటీపడుతున్న విద్యార్థులు

వివోఏలకు 5జి ఫోన్లు వెంటనే ఇవ్వాలని నిరసన

ప్రజాశక్తి-తర్లుపాడు: పాడైపోయిన మొబైల్స్ స్థానంలో 5జీ ఫోన్స్ ఇచ్చేవరకు ఆన్లైన్ వర్క్ నిలిపివేస్తామంటూ తర్లుపాడు మండల వివోఏలు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ వెలుగు వివోఏ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఏపీఎం రమేష్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం 2జి ఫోన్లతో 5జి ఫోన్ పనులు ఆన్లైన్ వర్క్ చేయమని వివోఏలను ఒత్తిడి చేయటాన్ని వ్యతిరేకించారు. ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలని, పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలని అన్నారు. వినతిపత్రాన్ని ఏపీఎం టి రమేష్‌కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివోఏలు కరిష్మా, పార్వతమ్మ, పీరాబీ, మల్లేశ్వరి, ఎస్తేరమ్మ, చంద్రకళ, శ్రీదేవి, నాగూర్‌బీ, నాగమల్లేశ్వరి, శారద తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం పేటెంట్ టిడిపిదే..

వైసిపి నాయకుడు గౌస్ మొహిద్దీన్

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో కల్తీ మద్యం పేటెంట్ టిడిపిదేనని తేలిపోయిందని వైసిపి రాష్ట్ర మైనార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ విమర్శించారు. తాజాగా వరసగా వెలుగులోకి వస్తున్న కల్తీ మద్యం ఘటనలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కల్తీ మద్యంపై ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కల్తీ మద్యంతో అమాయక పేద ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లింద న్నారు. టిడిపి ముఖ్య నేతల సారథ్యంలో కల్తీ మద్యం తయారవుతోందని, కల్తీ మద్యం తయారీలో వరసగా టిడిపి నేతలు పట్టుబడుతున్నారని, అయినా వైసిపి నేతలను టిడిపి నాయకులు దూషించడం వింతగా ఉందన్నారు. ఎవరు ఏమిటో ప్రజలు అర్థం చేసుకోలేనం తగా లేరని హితవు పలికారు. దొంగే దొంగ అన్నట్లుగా టిడిపి నేతలు వ్యవహరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కల్తీ మద్యం తయారు చేయడమే కాకుండా.. ఏకంగా లైసెన్స్ వైన్స్‌లో, బార్‌లలో ఆ కల్తీ మద్యం రాష్ట్ర వ్యాప్తంగా అమ్మడం అధికార పార్టీ అండతో జరిగిందని ఆరోపించారు. అధికార పార్టీ అండ లేకుండా ఇంతటి సాహసం మరొకరు చేయగలరా అని ప్రశ్నించారు. కల్తీ మద్యంపై కూటమిలోని జనసేన, బిజెపి నేతలు ఎందుకు నోరు మెదపలేకున్నారో అందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు.



గౌస్ మొహిద్దీన్

పెద్దదోర్నాల: తాజాగా పట్టుబడుతున్న కల్తీమద్యం ఘటనలతో రాష్ట్రంలో కల్తీమద్యం పేటెంట్‌దారులు టీడీపీ నేతలేనని వైసీపీ మైనార్టీ రాష్ట్ర నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా కాశింపీరా మాట్లాడుతూ కల్తీ మద్యంతో అమాయక పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు అని విజ్ఞప్తి చేశారు. కల్తీమద్యం తయారు చేసే టీడీపీ నేతలు వైసీపీని దూషించడం వింతగా ఉందన్నారు. నేడు రాష్ట్రంలో ఎక్కడ కల్తీ మద్యం పట్టుబడుతున్నా దానికి సూత్రధారులు టీడీపీ నేతలేనని బట్టబయలవుతోందన్నారు. ఈ ఘటనలతో కల్తీ మద్యం ఎవరి హయాంలో తయారవుతోందో ప్రజలకందరికీ తెలిసిపోయిందని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికైనా కూటమి నేతలు తమ వైసీపీపై చౌకబారు విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారిస్తే బాగుటుందని ఆయన కోరారు. కల్తీ మద్యం సూత్రధారులెవ్వరో ప్రజలకు తెలిసిపోయిందని, వచ్చే ఎన్నికల్లో కూటమి సర్కార్‌కు నూకలు చెల్లినట్లేనని ఆయన హెచ్చరించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, కారు

ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆగి ఉన్న ఆటోను కారు ఢీకొన్న సంఘటన బుధవారం మండలంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి ఎడవల్లి సమీపంలోని తిరుమల దేవుని సమీపంలో జరిగింది. ఆటో కూలీల కోసం ఆగి ఉంది. కర్ణాటక నుంచి దోర్నాల వైపు వస్తున్న కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను బలంగా ఢీకొంది. ఆటో ఎక్కిందుకు సిద్ధంగా ఉన్న మహిళలు చిట్యాల సరస్వతి, అల్లు వెంకట నారాయణమ్మ, ఆటో డ్రైవర్ వడిచెర్ల కృష్ణారెడ్డిలకు గాయాలయ్యాయి. వీరిని అక్కడే ఉన్న మరికొందరు కూలీలు అదే రోడ్డులో వస్తున్న మరో ఆటోను ఆపి దోర్నాల వైద్యశాలకు తరలించారు. చిట్యాల సరస్వతికి రెండు కాళ్లు, చేయి విరిగాయి. కృష్ణారెడ్డికి కూడా బలమైన గాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అల్లు వెంకట నారాయణమ్మను మార్కాపురం ప్రైవేటు వైద్య శాల తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన లారీ

మూలమలుపు వద్ద లారీ బోల్తా

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

కర్ణాటక నుంచి కలకత్తా క్యాబేజీ లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. వివరాలు ప్రకారం బుధవారం తెల్లవారు జామున దోర్నాల నుంచి గుంటూరు వెళ్లే బైపాస్ మూల వద్ద జరిగింది దీంతో డ్రైవర్ క్లీనర్‌కు అదృష్టవశాత్తూ ఎటువంటి బలమైన గాయాలు కాలేదు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెద్ద ఆరవీడు మండలం కుంట నుంచి దోర్నాల గణపతి చెక్‌పోస్ట్ వరకు బైపాస్ నడిపించారు. దోర్నాల ఊరి బయట ఊర్లోకి వెళ్లేందుకు అధికారులు కాంటాక్ట్‌లో నిర్లక్ష్యంతో పూర్తి పల్లవుగా ఏటవాలుగా రోడ్ నిర్మించారు. కొత్తగా వచ్చేవారు ఆదమరిస్తే అంతే సంగతులు. ఎవరికైతే మాకేమి అన్న నిర్లక్ష్యంగా వివరిస్తున్నారు. క్యాబేజీని మరోలారీకి వ్యక్తి తరలించారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. గతంలో అనేకమంది కూడా మరణించారు. రిటైర్డ్ లైన్మెన్ వెంకట్‌రెడ్డి మరణించారు. రామచంద్రరావు కోట గ్రామానికి చెందిన అల్లూరిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఇలా అనేకమంది బాధితులు ఉన్నారు. అధికారులు కాంటాక్టు పట్టించుకోవడంలేదని ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు

ప్రజాశక్తి-గిద్దలూరు

మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని గిద్దలూరు అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి కె భరత్‌చంద్ర వారికి జైలు శిక్ష, జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్‌కు మద్యం తాగి వాహనాలు నడుపుతూ నలుగురు పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపర్చారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో ఇద్దరికి 20 రోజుల జైలుశిక్ష, ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష, మరొకరికి ఒకరోజు జైలు శిక్ష మరియు రూ.10,000 జరిమానా విధించారని గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ తెలిపారు.

నేడు ఉద్యోగ, కార్మిక సదస్సు

హాజరు కానున్న మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-దర్శి

స్థానిక పిజెఎన్ కళ్యాణ మండపంలో గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపై సిఐటియు, యుటిఎఫ్, జనవిజ్ఞాన వేధిక అధ్వర్యంలో సదస్సు జరుగుతుందని నాయకులు తాండవ రంగారావు, మీనిగ శ్రీనివాసరావు, కెవి రమణారెడ్డి బుధవారం తెలిపారు. సిఐటియు జిల్లా 13వ మహాసభలు దర్శిలో జరుగుతున్న సందర్భంగా ఈ సదస్సులో కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ మేధావులు పాల్గొనాలని కోరారు. మాజీ శాసన మండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు వర్తమాన రాజకీయ పరిస్థితులు, ట్రంప్ సుంఖాలు, జిఎస్‌టి పన్నులు తదితర అంశాలపై వివరిస్తారని అన్నారు.

రైతు సంఘం 3వ మహాసభ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎపి రైతు సంఘం 3వ మహాసభను అక్టోబర్ 10న మార్టూరులో నిర్వహించనున్నట్లు రైతు సంఘం మండల కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య హాజరవుతారని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చర్చించనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రైతు సంఘం ప్రతినిధులతో సమావేశం ఉంటుందని తెలిపారు. అనంతరం కొణిదెన రోడ్డులోని ఎఎంసి యార్డ్ ఆవరణలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.



ఎంపిడిఓ విజయను అభినందిస్తున్న సిబ్బంది

ఎంపిడిఒ విజయ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చీరాల

ఎంపిడిఒగా ఎన్ విజయ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. దోర్నాల ఎంపీడీఓగా పనిచేసిన ఆమె బదిలీపై చీరాల వచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ పథకాలు గ్రామస్థాయికి చేరేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.



కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికైన ముత్తుపల్లి విద్యార్థులు

కబడ్డీ జట్టుకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - నిజాంపట్నం

బాపట్ల డివిజన్ స్థాయిలో నిర్వహించిన కబ్బడి అండర్ 14 పోటీలో మండలంలోని ముత్తుపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సిహెచ్ లోకేష్, డి మణికంఠ ఎంపికయ్యారు. పాఠశాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, పీడీ పి ఆంజనేయులుకు పాఠశాల హెచ్‌ఎం కె వనజాక్షి తోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలోని మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

నేడు కనిగిరిలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కనిగిరి

నిరుద్యోగ యువతీ, యువకులు, గృహిణిలు, డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు పార్ట్ టైమ్, ఫుల్ టైమ్ జాబ్స్, వర్క్ ఫ్రమ్ హెూం జాబ్స్ అవకాశాలు ఉన్నాయని ఐడియల్ కంప్యూటర్స్ డైరెక్టర్ బిజెవి ప్రవీణ్ కుమార్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18నుండి 45 ఏళ్ల కలిగిన అర్హులైన అభ్యర్థులు గురువారం ఐడియల్ కంప్యూటర్స్ ప్రాంగణంలో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. అర్హతను బట్టి రూ.20వేల నుండి రూ.40వేల వేతనం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా ఫాం తీసుకుని రావాలని సూచించారు.

మహిళా సమస్యలపై ఐక్య పోరాటం

ప్రజాశక్తి - రేపల్లె

మహిళా సమస్యలపై చైతన్యంతో ఐక్య పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఐద్వ జిల్లా అధ్యక్షులు కె ఝాన్సీ అన్నారు. ఐద్వా పట్టణ మహాసభ స్థానిక కొరటాల సత్య నారాయణ మీటింగ్ హాల్లో ఎస్‌కె ఆశ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. గుంటూరు జిల్లా నాయ కులు ఆర్ స్వాతి మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం ఐద్వా దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. రేపల్లె పట్టణంలో డ్వాక్రా, మైక్రో ఫైనాన్స్ సమస్యలపై పోరాటాలు ఐద్వ ఐక్యంగా చేపడతున్నట్లు తెలిపారు. మహాసభలో సిఐటియు జిల్లా ట్రెజరర్ సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ పట్టణంలో డ్వాక్రా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మెప్మా అధికారులకు చిత్తశుద్ధి లేదని అన్నారు. పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. భవిష్యత్తులో ప్రజా సంఘాలు, మహిళా సంఘం, ఐద్వా ఐక్యంగా మెప్మాలో అవినీతిపై



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు మణిలాల్

పోరాటం నిర్వహిస్తామని అన్నారు. 10 మందితో నూతన ఏకగ్రీవంగా ఎన్నికు న్నారు. అధ్యక్షులుగా ఎస్‌కె షకీరా, కార్యదర్శిగా కె నాంచారమ్మ, గౌరవాధ్యక్షురాలుగా ఎం వనజాక్షి, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె ఆశ, షబానా సుల్తానా, సహాయ కార్యదర్శులుగా కె సింధు దేవి, ఫర్జాన, కె స్వావమ్మ, ఆహ్వానితులుగా సీహెచ్ సుదీప్తి, కె అహల్య, వి ధనమ్మ పాల్గొన్నారు.

జడ్జిపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి

ప్రజాశక్తి - చీరాల

దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై ఒక మతోన్మాద న్యాయవాది చేసిన దాడి దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేపింది. ఈ ఘటనకు నిరసనగా కెవిపిఎస్, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక గడియార స్థంభం సెంటర్‌లో బుధవారం నిరసన తెలిపారు. సనాతన ధర్మం ముసుగులో రాజ్యాంగం న్యాయ వ్యవస్థపై దాడులు జరగడం దేశ విద్రోహ చర్యని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి పొందుతోందని అన్నారు. ఇలాంటి సంఘ వ్యతిరేక సంస్థను తక్షణం నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు లింగం జయరాజ్, సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం



నిరసన వ్యక్తం చేస్తున్న కెపిపిఎస్, సిఐటియు నాయకులు

వసంతరావు, దళిత మహాసభ నాయకులు నూకతోటి బాబురావు, కాటి మార్క్, బి లక్ష్మీ నరసయ్య, గోసాల ఆశీర్వాదం, శవనం శ్యామ్యూల్, వి భగవాన్ దాస్, యడం రవిశంకర్, బొల్లెద్దు సుబ్బారావు, బి అబ్రహం, ఎస్‌కె జిలాని, ఐవి ప్రసాద్, కెబికె రెడ్డి, వై నాగిరెడ్డి, విమలాకర్, జె రమేష్ పాల్గొన్నారు.

అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - కనిగిరి

సమానత్వం, సమాన హక్కులు, చట్టాల సాధన కోసం, మద్యం, మత్తు మందుల నుండి విముక్తి కోసం ఉద్యమిస్తున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు జయప్రదం చేయాలని ఐద్వ జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి కోరారు. స్థానిక సుందరయ్య కాలనీలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యాలుగా 1981లో ఏర్పడిన ఐద్వా మహిళా సంఘం నేడు దేశవ్యాప్తంగా విస్తరించి మహిళల హక్కులు, చట్టాల సాధన కోసం పోరాడుతున్నదని తెలిపారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉద్యమ నేతలు 600 మంది హాజరవుతున్నారని తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలే, మహిళా హక్కుల కోసం పోరాడుతున్న తీస్తా శతల్వాద్, జాతీయ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జిల్లా కార్యదర్శి రమాదేవి

నాయకులు ఎస్ పుణ్యవతి పాల్గొంటారని తెలిపారు. మహాసభల జయప్రదానికి ప్రజలు అన్ని రకాలుగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె షమీన, కె లక్ష్మీ ప్రసన్న, పి రత్నం, కె శాంత కుమారి, కె రత్తమ్మ, జి మల్లేశ్వరి, ప్రమీల, తిరుపతమ్మ, కె వెంకటమ్మ, ఎలీసమ్మ, లాల్ బి, రమణమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చీరాల

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలు ఇస్లాంపేట షాదీ ఖానాలో థైక్వాండో పోటీలు సోమవారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ, రాష్ట్ర టైక్వాండో వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నుండి 69 మంది క్రీడాకారులు పాల్గొనగా చీరాల టైక్వాండో విభాగానికి చెందిన విజ్ఞాన భారతి హైస్కూల్, శ్రీగౌతమి, సెంటాన్స్, కెజిఎంజి హైస్కూలు విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్ 17 బాలుర విభాగం వి హేమంత్, ఎస్‌కె కాలీషావలి, ఎన్ వెంకటరమణ, వి మనోహర్ ప్రథమ స్థానం పొందారు. అండర్ 17 బాలికల విభాగంలో ఎస్‌కె తాహిర, ప్రవళిక, వై లక్ష్మీప్రియ, బి కావ్య ప్రథమ స్థానం పొందారు. అండర్ 14 బాలుర విభాగంలో ఎల్ కార్తీక్ మణికంఠ, వి శరత్ కుమార్ ప్రథమ స్థానం సాధించారు. అండర్ 14 బాలికల విభాగంలో ఎస్‌కె తస్లీమా, వి జాహ్నవి



తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రథమ స్థానం సాధించారు. ఈ నెల 10, 11 తేదీల్లో రేపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో ఎంపికైన విజేతలు పాల్గొంటారని తెలిపారు. అండర్ 17 విభాగం క్రీడాకారులు 18 తర్వాత కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్‌లు ఎస్‌డి సలావుద్దీన్, పి ప్రశాంత్ బాబును ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపల్స్, పిఈటీలు అభినందించారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కనిగిరి

ఈనెల 18న చెకుముకి సైన్స్ సంభరాలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ రామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందింప చేసేందుకు జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడం హర్షనీయమని అన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్న జెవివి గత 35ఏళ్లుగా చెకుముకి నిర్వహిస్తున్నదని అన్నారు. 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరుగుతాయని తెలిపారు. 8, 9, 10 తరగతుల ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జెవివి నాయకులు బషీర, మహిబూన్, బ్రహ్మయ్య, మేడం కోటిరెడ్డి, రవీంద్ర, నాగరాజు, జిలాని, రిటైర్డ్ ఎంఈఓ వీరంరెడ్డి నాగిరెడ్డి, టి వెంకట్రామిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు రమణారెడ్డి, రాము పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బహుమతులు అందజేత

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరం జెడ్‌పి ఉన్న పాఠశాల విద్యార్థులకు జిఎస్‌టిపై వ్యాస రచన, చిత్ర లేఖనం, వక్తృత్వం, యోగ తదితర పోటీలు మంగళవారం నిర్వహించారు. డిఇఒ పురుషోత్తం అధ్యక్షతన బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పాఠశాలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండడం చాలా గొప్ప విషయం అన్నారు. విద్యార్థులు చక్కగా చదివి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని అన్నారు. అనంతవరం గ్రామానికి సంబంధించిన సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వ్యాస రచనలో బి నాగ శ్రావణి, మేఘన, గెహన సాయిశ్రీ, చిత్ర లేఖనంలో ఆరిఫ్, మేఘన, కార్తీక్ బహుమతులు పొందారు. బాపట్ల ఆర్‌డిఒ పి గ్లోరియా, జిఎస్‌టి అధికారులు మురళి కృష్ణ, జాయింట్ కలెక్టర్ నాగిరెడ్డి, కృష్ణ మోహన్, శ్రీనివాసరావు, తహశీల్దారు రవికుమార్, ఎంపిడిఒ జావేద్, డిప్యూటీ ఎంపిడిఒ కృష్ణ, విఆర్ఒ శేషుబాబు, ఆర్ఐ విషు, పంచాయతీ కార్యదర్శి దొప్పాలపూడి మోహన్ బాబు, ఎంఇఒలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, గోపి, హెచ్‌ఎం రాఘవరెడ్డి, రామమోహనరావు, శ్రీనివారావు, యోహాన్, కృష్ణారెడ్డి, సిహెచ్ శ్రీనివాసరావు, రజని, సరస్వతి, శ్రీదేవి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఆర్గనైజేషన్ నిర్వాహకులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - బాపట్ల

కిడ్నీ వ్యాధి బాధితునికి వైద్య ఖర్చుల నిమిత్తం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల సురేష్, గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, కోశాధికారి జోగి సువర్ణ రాజు, అక్కి శీను, వై శ్రీనివాసరావు, పండు పాల్గొన్నారు.


బహుమతులందజేస్తున్న అటవీ అధికారులు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

71వ అంతర్జాతీయ వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక నలంద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురంలో బుధవారం నిర్వహించిన వేడుకలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలంద ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్ లీలా అస్మితరెడ్డి, ఆర్ నిత్యశ్రీ, ఎస్ జాయ్ షారున్‌లకు మార్కాపురం డీడీటీ అబ్దుల్ రవూఫ్, డీఎస్పీ నాగరాజు, ఎఫ్ఆర్ఓ ఏ ప్రసన్నజ్యోతి, డిఆర్ఓ శివకుమార్‌ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ఆ పాఠశాల కరెస్పాండెంట్ పద్మజ ఓబులరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పెమ్మసాని చంద్రహాసరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: డిపిఒ

ప్రజాశక్తి-పొదిలి

గ్రామాలలో ప్రజలు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరిగి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామంలో చెత్త సేకరణ పరిశుద్ధ నిర్వహణపై సచివాల సిబ్బంది ఇతర అధికారులతో మాట్లాడారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోర్స్ లెవల్లో సెగ్రిగేషన్ చేయుచున్న విధా పరిశీలించి తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని క్లాప్ మిత్రలకు సూచించారు. గ్రామంలో రక్షిత నీటికి సంబంధించి క్లోరినేషన్ చేయాలని సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. వాటర్ టెస్టింగ్ రిపోర్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుత్తా శోభన్‌బాబు, గౌరవ సర్పంచ్ గుంటూరు ఏసోబు, పంచాయతీ కార్యదర్శి యు శేషగిరి, వివిధ శాఖల సిబ్బంది కుమారి, ఎస్ ధాన్‌బాషా, మురళి, నాగలక్ష్మి, తిరుపతమ్మ, స్వచ్ఛ భారత్ కార్మికులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ గవర్నర్ వేణుకు సత్కారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వాసవీ క్లబ్ నూతన గవర్నర్‌గా 2026 సంవత్సరానికి ఎంపికైన అమరా వేణును సంతనూతలపాడు వాసవీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఒంగోలు వాసవీ విద్యానిధి భవన్లో జరిగిన ఒక కార్యక్రమంలో వాసవీ క్లబ్ నూతన గవర్నర్‌గా అమరా వేణు, ప్రధాన కార్యదర్శిగా చలువాది సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా గుర్రం రంగనాథ్, సర్వీస్ కార్యదర్శిగా పి రాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఉమా అన్నపూర్ణ అధ్యక్షతన ఈ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. వాసవీ క్లబ్ నూతన కమిటీని వాసవీ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం సహాయ కార్యదర్శి చక్కా సుబ్బరాయుడు, సంతనూతలపాడు వాసవీ క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, మాజీ అధ్యక్షులు జి బద్రినారాయణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జి శరత్‌బాబు తదితరులు సత్కరించారు.

ప్రజలందరికీ చంద్రబాబు వెన్నుపోటు

రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులు • అవన్నీ సీబీఎన్, పీకే, ఎల్కే బ్రాండ్లే: మాజీ మంత్రి మేరుగ నాగార్జున ధ్వజం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారని రాష్ట్ర మాజీ మంత్రి, వైసిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగ నాగార్జున విమర్శించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకు ఇస్తామని, దేశంలో ఎక్కడా లేని వింత వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గత 16 నెలలుగా నకిలీ మద్యం ఏరులై పారిస్తున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 85 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వాల్సి ఉండగా కేవలం 40 నుంచి 50 లక్షల మందికే అందజేశారని విమర్శించారు. నకిలీ మద్యం సరఫరాతో చంద్రబాబు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో బూంబూం అంటూ విమర్శలు గుప్పించిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ బ్రాండ్‌తో పాటు సూపర్ సిక్స్ అనే బ్రాండ్ మద్యాన్ని కూడా అమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. రాయలసీమలో నకిలీ మద్యం ప్లాంట్లు రెండు బయటపడడం, వీటి వెనుక టీడీపీ కీలక నేతలే ఉండడం, ఉత్తరాంధ్రలోనూ నకిలీ మద్యం ప్లాంట్లు ఉన్నాయని సమాచారం రావడంతో రాష్ట్రంలో మద్యం ప్రియుల వెన్నులో వణుకు పుడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తోందన్న విషయం ప్రజలకు అర్థమైందన్నారు.

కలుగు నాయుడుగా మిగిలాడు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక కలుగు నాయుడుగా మిగిలిపోయారని మేరుగ నాగార్జున ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో అరవటం, రెచ్చిపోవటం, ఊగిపోవటం, తూగిపోవటం, జుట్టు పీక్కోవటం లాంటి చేష్టలు చేసిన ఆయన ఇప్పుడు మహిళలపై ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా మాట్లాడకుండా కలుగులోనే ఉంటున్నారని విమర్శించారు. సొంత అన్నయ్యను బాలకృష్ణ అగౌరవపరిచినా బయటకు రాకపోవడం దారుణమన్నారు. పవన్ కళ్యాణ్ నిజస్వరూపాన్ని ఇప్పుడు ప్రజలు చూస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం అని వ్యాఖ్యానించిన కూటమి నాయకులు ప్రస్తుతం సీబీఎన్, పీకే, ఎల్కే బ్రాండ్లు తయారు చేసి వైన్ షాపులు, బెల్టుషాపుల్లో విక్రయిస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో ప్రతి మద్యం బాటిల్‌ను డిస్టిలరీల్లోనే తయారు చేశారని, ఇప్పుడు టీడీపీ నాయకుల ఇళ్లలోనే నకిలీ మద్యం తయారవుతోందని అన్నారు. కూటమి సర్కారు పాపాలు పండే రోజు దగ్గర్లోనే ఉందని ఆయన పేర్కొన్నారు.

వన్య ప్రాణుల రక్షణ బాధ్యత అందరిదీ

అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-మార్కాపురం

అడవులు, వన్య ప్రాణుల రక్షణ బాధ్యత అందరిదని అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్, నంద్యాల ప్రాజెక్ట్ డైరెక్టర్ బి విజయ్‌కుమార్ అన్నారు. మానవ మనుగడకు అడవులు, వన్య ప్రాణులు ఎంతో అవసరమని చెప్పారు. 71వ వన్య ప్రాణి వారోత్సవాల ముగింపు వేడుకలు సర్కిల్ స్థాయిలో మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అటవీశాఖ మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ రవూఫ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్‌కుమార్ మాట్లాడుతూ అడవులు కరువు కాటకాలను జయిస్తాయన్నారు. నేటి కాలంలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు పచ్చదనం మరింత పెంచుకోవాలన్నారు. అడవుల సంరక్షణకు వన్యప్రాణులు అవసరమన్నారు. అడవులు, అడవిలోని జంతువులు మానవ జాతికి ఎంతో అవసరమని తెలిపారు. వన్యప్రాణులను వేటాడవద్దన్నారు. అడవులను నరికివేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వనరులను కాపాడుకోవాలన్నారు. వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించారు. అడవులు, వన్యప్రాణుల అవసరాలు తెలియజేస్తూ విద్యార్థులు పలు రకాల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అంతకు ముందుగా పట్టణంలో ప్రదర్శనతో అవగాహన కల్పించారు. పోటీల్లో నెగ్గిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ముఖ్య అతిథులుగా మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు నాగరాజు, నంద్యాల అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి, అనురాగ్‌మీనా, గిద్దలూరు అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓ బాలరాజు తదితరులు పాల్గొని అడవులు, వన్యప్రాణుల విశిష్టతను వివరించారు. చివరగా అడవులు, వన్యప్రాణులను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.


పులి వేషధారణలో విద్యార్థులు, పాల్గొన్న అధికారులు

డిజె సౌండ్‌కు స్వస్తి పలకాలి: సిఐ

ప్రజాశక్తి-మార్కాపురం


మార్కాపురం సిఐ పి సుబ్బారావు

ప్రజల ఆరోగ్య రీత్యా డిజె సౌండ్‌కు ఇక స్వస్తి పలకాలని మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి సుబ్బారావు బుధవారం విజ్ఞప్తి చేశారు. శుభకార్యాలు, తిరునాళ్లలో కూడా డిజెలను వినియోగించరాదన్నారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు సైతం డిజెలు వినియోగించరాదన్నారు. డిజె సౌండ్ కారణంగా చిన్నారులు, వృద్ధులు, గుండె జబ్బుతో బాధపడుతున్నవారు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్య రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డిజె వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంభం రూరల్: కంభం, బి పేట అర్ధవీడు మండలాల పరిధిలో ఫంక్షన్లకు తిరునాళ్లకు ఏదైనా ఇతర కార్యక్రమాలకు ఎవరైనా మైకు సిస్టం వాడే సమయంలో డీజేలకు అనుమతి లేదని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె మల్లికార్జున తెలిపారు. డీజేలను అధిక సంఖ్యలో వాడటం వల్ల ఆ శబ్దాలకు ప్రజలు చనిపోతున్నారన్నారు. ఎవరైనా ఎలాంటి ఫంక్షన్లు, ఉత్సవాలు, తిరునాళ్లు, మీటింగులు జరుపుకోవాలని ఉంటారో వారు ఖచ్చితంగా స్థానిక ఎస్ఐ ద్వారా సబ్ డివిజనల్ పోలీస్ అధికారికి పర్మిషన్ అప్లై చేసుకోవాలన్నారు. పర్మిషన్ పొందినవారు మైకు లేదా ఏదైనా సౌండ్ బాక్స్‌లు పరిమిత సంఖ్యలో మాత్రమే వాడుతూ సౌండ్ మించకుండా ఉండేలా చూసుకోవాలని అన్నారు. అలాకాకుండా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యర్రగొండపాలెం: మండల పరిధిలోని గ్రామాల్లో శుభకార్యాలకు, వివాహాలకు, తిరునాళ్లకు, ఉత్సవాలకు ఇతర కార్యక్రమాలు చేసుకునే నిర్వాహకులు మైకు, డీజే సౌండ్‌కు అనుమతులు లేవని ఎస్ఐ పి చౌడయ్య తెలిపారు. స్థానిక పోలీస్ శాఖ కార్యాలయంలో బుధవారం ఎస్ఐ చౌడయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో డీజేలను అధిక సంఖ్యలో వాడటం, ఎక్కువగా సౌండ్ పెట్టడం వల్ల ఆ శబ్దాలకు చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె జబ్బులు సమస్యలు ఉన్నవారి ప్రాణానికే ప్రమాదం సంభవించే పరిస్థితి ఉందన్నారు. కాబట్టి డీజే వాడకం నియంత్రిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అనుకుంటారో వారు తప్పనిసరిగా స్థానిక ఎస్ఐ ద్వారా సబ్ డివిజనల్ పోలీస్ అధికారికి దరఖాస్తు పెట్టుకోవాలని తెలిపారు. అనుమతి పొందినవారు మైకు, సౌండ్ బాక్స్‌లు పరిమిత సంఖ్యలో మాత్రమే ఉపయోగించుకోవాలని అన్నారు. సౌండ్ పరిమితి మించకుండా ఉండేలా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలా కాదని ఎవరైనా పోలీసు నిబంధనలు ఉల్లంఘించినా, వాటిని పాటించకపోయినా అటువంటి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


'చెకుముకి' గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

చెకుముకి సంబరాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన అన్ని పాఠశాలల్లో జరగనున్న చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను మార్కాపురంలోని ఐక్యా కోచింగ్ సెంటర్‌లో బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి శరత్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులందరూ ఈ సంబరాలలో పాల్గొనాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు ఒద్దుల వీరారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు యు వెంకటరావు, ఏనుగుల రవికుమార్, గుండాల ముక్తేశ్వరరావు, మర్రిపూడి శ్రీనివాసులు, కే సాయికృష్ణ, డి శంకర్‌రెడ్డి, ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెండోరోజు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-గిద్దలూరు

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించినందుకు నిరసనగా బుధవారం గిద్దలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు 2వ రోజు తమ విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాలుగుళ్ల నాగ శేషశయనారెడ్డి, ఆవులమంద తిరుమల ప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని అని పేర్కొన్నారు.

సంతకాల సేకరణకు ఆదరణ

ప్రజాశక్తి-మార్కాపురం

బిజెపి ఓట్ చోర్‌పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలో సంతకాల సేకరణ జరుగుతోంది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్ ఖాన్ సంతకాల సేకరణ చేపట్టారు. బుధవారం కూడా మార్కాపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సంతకాల సేకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మండల నాయకుడు శామ్యూల్, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.


'గ్రీవెన్స్'లో పాల్గొన్న టీడీపీ నేత కృష్ణ కిషోర్ రెడ్డి

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కొమరోలు

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ ఆఫీసులో టిడిపి మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కార్యక్రమం బుధవారం రెండోరోజు కొనసాగింది. కృష్ణకిషోర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ముత్తుముల సంజీవరెడ్డి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి పరిశీలించారు. ప్రజలు ప్రధానంగా సిమెంట్ రోడ్లు, రెవెన్యూ, విద్యుత్, తాగునీరు తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలక్ష్మి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఇడమకల్లు సొసైటీ చైర్మన్ బిజ్జం తిరుమలరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబులరెడ్డి, టిడిపి తెలుగు యువత అనప వీరశేఖర్ ముక్తాపురం సర్పంచ్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికులకు కాంగ్రెస్ మద్దతు

ప్రజాశక్తి-దర్శి

అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల చైర్మన్, దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కైపు వెంకట కృష్ణారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా 3.5 లక్షల కార్మికుల జీవితాలతో చలగాటం ఆడుతుందన్నారు. 27వేలతో ఉన్న ప్రభుత్వం రాయితీలు కూటమి ప్రభుత్వం గెలిచినాక రూ.40వేలు చెయ్యడమే గాక ఎఎంఆర్, రుద్ర అనే కంపెనీలకు కూడా రాయితీలు కట్టాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన సంస్థలలైతే ఏమి గుర్తింపు పొందన సంస్థలు అయితే ఏమి 5వేల సంస్థలు మూసి వేయడం వల్ల మన ప్రాంతం పక్క రాష్ట్రం నుండి వచ్చిన కార్మికులు లబోదిబోమని ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. కార్మికులకు కల్పించాల్సిన సౌకర్యాలు కల్పించట్లేదని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఈ బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ మూతపడితే రాష్ట్రానికే చెడ్డ పేరు వస్తుంది అన్నారు. పరిశ్రమల దగ్గర పనికిరాని పక్కన పడేసిన రాళ్ల మీద కూడా రాయితీలు విధిస్తున్నారని, త్వరలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్రానైట్ ఫ్యాక్టరీలోని కార్మికులకు మద్దతుగా వాళ్ల జీతభత్యాల గురించి పరిశ్రమల యజమానులు కల్పించాల్సిన సౌకర్యాల గురించి ఆందోళన చేస్తామన్నారు.

ఇన్‌ఛార్జి ఆర్ఐగా జక్రయ్య

ప్రజాశక్తి - భట్టిప్రోలు


ఆర్ఐ జకరయ్య

ఇంచార్జ్ ఆర్ఐగా మంద్రు జక్రయ్య నియమితులయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన మండలంలోని వివిధ గ్రామాలకు విఆర్ఒగా పనిచేశారు. ప్రస్తుతం చింతమోటు విఆర్ఒగా పని చేస్తున్నారు.

11న ఎపిటిఎఫ్ విద్యా సదస్సు

ప్రజాశక్తి - సీఎస్ పురం రూరల్

ఈనెల 11న నాగులుప్పలపాడులో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ తెలిపారు.

పంగులూరు : ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడులో ఈనెల 11న నిర్వహించే విద్యా సదస్సుకు ఉపాధ్యాయులు హాజరు కావాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జె వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు చేజర్ల రామారావు, జిల్లా కౌన్సిలర్ కంకణాల శ్రీనివాసరావు, తన్నీరు వెంకట్రావు ,షేక్ రహం తుల్లా బుధవారం కోరారు.

సుఖవ్యాధుల పట్ల అవగాహన

ప్రజాశక్తి-దర్శి

సుఖ వ్యాధులు పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రతినిధి ఐపీ సుబ్బారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్ యునతాన్ అధ్యక్షతన విద్యార్థులకు సుఖ వ్యాధులు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు.

అర్హులైన కూలీలకు పని కల్పించాలి

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకంలో పనులు గుర్తించి పని కల్పించాలని టిడిపి మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని హనుమంతపురంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు ప్రణాళిక ప్రక్రియపై మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. అనంతరం వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపును రైతులకు వివరించారు.

మహిళల రక్షణకు శక్తి యాప్

ప్రజాశక్తి - చీరాల

అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు రక్షణ కవచంగా శక్తి యాప్ ఉంటుందని శక్తి బృందం ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మోయిన్ సూచనలతో మండలంలోని ఈపురుపాలెం, గవినివారిపాలెం జడ్‌పి హైస్కూల్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి బృందం ఎస్ఐ ఎ హరిబాబు, ట్రైని ఎస్ఐ అలేఖ్య, కానిస్టేబుల్ కె సుబ్బారావు, సునీత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

జొన్నతాళి అండర్ పాస్ ఎత్తు పెంచండి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


పీడీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మార్టూరు సమీపంలోని జొన్నతాలి వద్ద జాతీయ రహదారిపై అధికారులు ప్రతిపాదించిన అండర్ పాస్‌ను స్థానిక రవాణా అవసరాలు పరిగణనలోకి తీసుకుని ఎత్తు పెంచాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నేషనల్ హైవే పిడి అనిల్ కుమార్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆ లేఖను క్యాంపు కార్యాలయ ప్రతినిధులు పీడీకి బుధవారం అందజేశారు. జొన్నతాళి, మార్టూరు ప్రాంతాలు వాణిజ్య రవాణా కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. గ్రానైట్, పత్తి తరలించే భారీ వాహనాలు, లారీలు, బస్సులు తరచుగా ఈ రహదారి మీదుగా వెళుంటాయని తెలిపారు. ప్రస్తుతం టెండర్ ప్రకారం ప్రతిపాదించిన 4.5 మీటర్ల క్లియరెన్స్ పెద్ద వాహనాలకు సరిపోదని, కనీసం 5.5 మీటర్ల ఎత్తు ఉండేలా డిజైన్ మార్చాలని కోరారు. రాజుపాలెం వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్‌కు 5.5 మీటర్ల ఎత్తు ప్రతిపాదించగా జొన్నతాళి వద్ద తక్కువ ఎత్తు ఎందుకు ఉందో స్పష్టత ఇవ్వాలని కోరారు. భవిష్యత్తు 50 ఏళ్ల రవాణా అవసరాలు దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలని కోరారు. మార్టూరు నేషనల్ హైవే ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, వర్షాకాలంలో నీటి నిల్వలు ఉంటున్నాయని తెలిపారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. మార్టూరులో మెయిన్ అండర్ పాస్ వద్ద సర్వీస్ రోడ్డు లెవలింగ్ చేయాలని సూచించారు. జొన్నతాళి అండర్ పాస్ నిర్మాణం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గి, ప్రజలకు రవాణా సౌకర్యం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, కామినేని జనార్ధన్, షేక్ రజాక్, క్యాంప్ కార్యాలయ ప్రతినిధి శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

ప్రజాశక్తి - దొనకొండ

స్థానిక వెలుగు కార్యాలయంలో నిధులు దుర్వినియోగంపై విజిలెన్స్ జిల్లా ఇన్‌స్పెక్టర్ అపర్ణ బుధవారం విచారణ చేపట్టారు. 2016–19 మధ్య వెలుగు సీసీగా విధులు నిర్వర్తించిన సేచేంద్రరావు ఎర్రబాలెం, బేతేల్‌పురం, రాగమక్కపల్లి, గుడిపాడు, గంగదేవిపల్లి, బాదాపురం గ్రామాల సంఘాల్లో పొదుపు మహిళలకు చెందిన రూ.14 లక్షలు వివిద రకాల నిధులు స్వాహ చేసి అతని భార్య, అమ్మ బ్యాంక్ అకౌంట్లకు జమ చేసుకున్నాడనే ఆరోపణలు అప్పట్లో వెల్లడయ్యాయి. దీంతో ఉన్నతాధికారులు సుచేంద్రరావును విధుల నుండి సస్పెండ్ చేశారు. అనంతరం విచారించాలని డీఆర్‌డీఏ, విజిలెన్స్ అధికారులకు అప్పగించారు. దీంతో విజిలెన్స్ సీఐ అపర్ణ వెలుగు కార్యాలయంలో అన్నీ రకాల రికార్డులు క్షున్నంగా తనిఖీ చేసి అప్పట్లో పనిచేసిన సీసీలు, విఒఎలు, గ్రూపు లీడర్లను విచారించారు. ఏ స్థాయిలో ఎవరెవరు నిధుల దుర్వినియోగంకు కారకులయ్యారో వివరాలు సేకరించారు. రకరకాల తప్పిదాలతో పాటు స్థానిక కెనరా బ్యాంక్ సిబ్బంది సహకారం ఉన్నట్లు భావిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదికలు ఉన్నతాధికారులకు అందజేసి తగిన చర్యలు తీసుకోనున్నట్లు విజిలెన్స్ సీఐ అపర్ణ తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఎజి అనిత, ఎపిఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి - కనిగిరి


ఉద్యోగులను నిలదీస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

పట్టణంలోని 1వ సచివాలయంను మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో తొమ్మిది మంది ఉద్యోగులకు గాను ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారు. రికార్డుల్లో మాత్రం ఉండవలసిన ఎక్కువ మంది ఉద్యోగస్తులు సర్వేల పేరుతో బయట ఉన్నారని, ప్రజలకు అందుబాటులో లేక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తునట్లు గుర్తించారు. గతంలో పరిమితమైన బాధ్యతలే అప్పచెప్పి వారి ద్వారా అన్ని రకాల సేవలు ప్రజలకు అందే విధంగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం సచివాల సిబ్బందిని ప్రభుత్వం రకరకాల సర్వేల పేరుతో బయటకు పంపి సచివాలయంలో ఎవరు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని అన్నారు. వాలంటీర్లు చేయాల్సిన పనులన్నీ సచివాలయ సిబ్బందితో చేయిస్తున్నారని అన్నారు. పరిశీలించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ఉండాల్సిన రికార్డులు సచివాలయంలో భద్రత లేకుండా ఒక గదిలో ఉండటం చూసిన ఆయన అవాక్కయ్యారు. రికార్డులు ఇక్కడ పడవేసి జనన మరణ ధ్రువపత్రుల కొరకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చేవారికి రికార్డు అందుబాటులో లేవని చెప్పి పంపడం ఏమిటని నిలదీశారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న దాతలు

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అద్దంకి

ప్రతిభావంతులైన బ్రాహ్మణ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.20వేలు అందించారు. పూజశ్రీ, నాగవెంకట సుప్రజ, నాగశారద, శ్రీరమ్యకు దాతలు గుళ్లాపల్లి రిటైర్డ్ జడ్జి, పిఎస్ఆర్ చంద్రమూర్తి, ఎం గోపాలరావు, శ్రీనివాసాచార్యులు, ప్రసాదు, శివరామకోటేశ్వరరావు, శేషతల్ప శాయి అందజేశారు. కార్యక్రమంలో శివనాగేశ్వ రరావు, సత్తెనపల్లి పవన్ కుమార్, రాచపూడి మహాలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేటపాలెం ఎస్ఐ పి జనార్ధన్

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - వేటపాలెం

పెరుగుతున్న నేరాలు, చెడు ప్రవర్తనలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి జనార్ధన్ సూచించారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు అవగా హన కల్పించారు. సైబర్ నేరాల పట్ల తల్లి, దండ్రు లకు అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం ఉమ్మిటి వేణు గోపాలరావు, స్టాఫ్ సెక్రటరీ కాల్వ సోమశేఖర్ పాల్గొన్నారు.


పాఠశాలకు మైకును బహూకరిస్తున్న దృశ్యం

పాఠశాలకు మైక్ బహూకరణ

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు శ్రీగిరి శ్రీనివాసరావు మైక్ సెట్ బుధవారం బహుకరించారు. శ్రీనివాసరావు పంగులూరు హైస్కూల్లో 2017 – 25లో ఎస్ఎ (పీఎస్) ఉపాధ్యాయునిగా పనిచేశారు. ప్రస్తుతం మండలంలోని పావులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. శ్రీనివాసరావు తండ్రి హనుమంతరావు జ్ఞాపకార్థం రూ.12,500 విలువైన మైక్ సెట్ విద్యార్థుల ఉపయోగార్థం బహుకరించారు. హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి తలపనేని రామాంజనేయులు అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-తాళ్లూరు

మండలంలోని తూర్పుగంగవరంలోని శ్రీలక్ష్మీవెంకటరమణ జనరల్ మర్చంట్స్‌ను, శ్రీవరలక్ష్మీ ట్రేడర్స్‌ను, శ్రీశ్రీనివాస ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్‌ను ఎఒ బి ప్రసాదరావు బుధవారం తనిఖీ చేశారు. గడువు దాటిని మందులను రైతులు కొని నష్టపోకుండాదని, తయారు తేది, గడువు ముగిసిన తేదిని రైతులు ఖచ్చితంగా చూసుకోవాలన్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నరాంబాబు

వైసీపీ నాయకులు బాలయ్య మృతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్లకు చెందిన వైసిపి నాయకులు బత్తుల బాలయ్య (72) అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. వైసీపీలో సభ్యునిగా ఉన్నారు. గతంలో కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీగా పోటీ చేసి ఓటమి చెందారు. బాలయ్య మరణ వార్త తెలుసుకున్న మార్కాపురం వైసిపి ఇన్‌చార్జి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మంగళవారం రాత్రి బాలయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, ఉపసర్పంచ్ మెట్టు అల్లూరిరెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు. టిడిపి నాయకులు మువ్వా కాటమరాజు, పాత్రికేయులు పివి కొండయ్య, పి బాలనరసయ్య పరామర్శించారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రేపల్లె


డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగ జరుపుకోవాలని, అందుకు అనుగుణంగా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు అన్నారు. ఎస్పీ బి ఉమా మహేశ్వరరావు ఆదేశాల మేరకు సబ్ డివిజన్లోని 11 పోలీసు స్టేషన్ల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణా సంచా దుకాణాల వద్ద అగ్నిమాపక నిబంధనలు పాటించాలని చెప్పారు.

వేటపాలెం : సరైన భద్రతా ప్రమాణాలు పాటించడం విక్రేతదారుల బాధ్యతని రూరల్ సిఐ పి శేషగిరిరావు అన్నారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం, అక్కయ్యపాలెం ప్రాంతాల్లోని శ్రీనివాస ఫైర్ వర్క్స్, అఖిల్ ట్రేడర్స్ లైసెన్స్ బాణసంచా దుకాణాలను ఆయన బుధవారం సందర్శించారు. పోలీసు, అగ్నిమాపక, వైద్య శాఖల సమన్వయంతో దీపావళి పండుగ అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - బాపట్ల


ఎంఎల్ఎ నరేంద్రవర్మ

నియోజకవర్గంలో నూతన రోడ్ల నిర్మాణం, రోడ్ల మర మ్మతులకు ప్రభుత్వం రూ.14.45కోట్ల నిధులు మంజూరు చేసినట్లు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ బుధవారం తెలిపారు. కర్లపాలెం నుండి పెదపులుగు వారిపాలెం రోడ్డుకు రూ4.75 కోట్లు, మాచవరం నుండి అల్లూరు రోడ్డు రూ.6కోట్లు, చందోలు బ్రిడ్జ్ నుండి అల్లూరు బ్రిడ్జి వరకు రూ.3కోట్లు, చందోలు నుండి ఇంటూరు వరకు రూ.1కోటి నిధులు మంజురు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు.

యద్దనపూడి : మండలంలోని గన్నవరం, పూనూరు రోడ్ల నిర్మాణానికి రూ.5.80కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. గన్నవరం, మార్టూరు రోడ్డుకు రూ.2.80 కోట్లు, పునూరు, గన్నవరం రోడ్డుకు రూ.3కోట్లు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. మార్టూరు, ద్రోణదుల రోడ్డుకు రూ.3కోట్లు మంజూరు అయ్యాయి.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాటూరి నాగేశ్వరరావు సేవలు అభినందనీయమని ఎంఇఒ టి నవీన్ కుమార్ అన్నారు. స్థానిక ఆరేపల్లి ఎంపియుపి పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాటూరి నాగేశ్వరరావును అభినందించారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరు కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కార అవార్డు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం ప్లేట్లను బహుకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరదాప కోటేశ్వరరావు, మురళి, రమాదేవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇవ్వడం వలనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సిడిపిఓ సులోచనరాణి అన్నారు. స్థానిక అంగనవాడీ కేంద్రంలో పోషణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పిల్లలకు తల్లిపాలు ఆరోగ్య దాయకమని అన్నారు. ఎంఎస్ కె వసుంధర దేవి బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సూపర్వైజర్ లీలావతి పిల్లల పోషణపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని అన్నారు.

ఆరోగ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని ఇడుపులపాడు యూపీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం పెడపర్తి పేరిరెడ్డి మాట్లాడారు. మానసిక ఆరోగ్య బోధన నిపుణురాలు ఎన్ పారిజాన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలు, భావాలు, ప్రవర్తన విశ్లేషించుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధించుకో గలరని తెలిపారు.

ప్రిన్సిపాల్ కొట్టడంతో విద్యార్థి చేతికి గాయం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఇరువురు ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఘర్షణ విషయం తెలుసుకున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యార్థిని దండించడంతో విద్యార్థి చేతి ఎముక విరిగిన సంఘటన గుల్లపల్లి ఎన్నార్ై జూనియర్ కళాశాలలో జరిగింది. ఇంటర్ విద్యార్థి చల్లపాల్ గాంధీ అనే విద్యార్థిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ విచక్షణా రహితంగా కొట్టడంతో చేతి ఎముక విరిగి తెనాలి ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నాడు. పాల్ గాంధీ, యశ్వంత్ అనే విద్యార్థుల మధ్య ప్రారంభమైన గొడవ ఇద్దరు కొట్టుకునే వరకు రావడంతో ప్రిన్సిపాల్ విద్యార్థులను దండించారు. విద్యార్థి చేయి అడ్డుపెట్టడంతో చేతికి గాయమైంది. విద్యార్థి తల్లిదండ్రులు వెంటనే విద్యార్థి పాల్ గాంధీని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యం కోసం తెనాలి వైద్యశాలకు తీసుకుని వెళ్లారు. అక్కడ ఎక్సరే, స్కానింగ్ పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతని చేతి ఎముక విరిగినట్లుగా తెలిపారు.

ఆళ్లవారిపాలెంలో మహిళపై దాడి

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని ఆళ్లవారిపాలెంలో ఉద్రిక్తత ఏర్పడింది. నిద్రిస్తున్న వివాహిత మహిళపై విచక్షణా రహితంగా దాడి చేసి, చీరను మెడకు బిగించి హత్యాయత్నంకు ఓ వ్యక్తి పాల్పడ్డాడు. చెరుకుపల్లి మండలం ఆళ్లవారిపాలెం పంచాయతీ బాప్టిస్ట్ పాలెంలో ఈనెల 6న జరిగిన చిన్న ఫంక్షన్‌లో కొక్కిలిగడ్డ శిరీష, గాలిమోటు హైమా మధ్య వివాదం జరిగింది. ఇరు కుటుంబాలకు చెందిన మహిళలు ఒకరినొకరు దుర్భాషలాడుకున్నారు. అయితే వైసీపీ బూత్ కమిటీ అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న హైమా భర్త గాలిమోటు రాజశేఖర్ దురుసుగా ప్రవర్తిం చి కొక్కిలిగడ్డ శిరీష ఇంటిపైకి వెళ్లి అంతు చూస్తానంటు బెదిరింపులకు పాల్పడ్డట్లు బాధితురాలు ఆరోపించారు. చుట్టుప్రక్కల వారు సర్ది చెప్పడంతతో గొడవ అప్పటితో సర్దుమనిగింది. శిరీషపై కక్ష పెంచుకున్న రాజశేఖర్ ఈనెల 7న తెల్లవారు జామున ఆమె భర్త నాగరాజు బయటకు వెళ్లడంతో నిద్రిస్తున్న శిరీష వద్దకు వెళ్లి విచక్షణ రహితంగా దాడి చేశాడని ఆరోపించారు. దాడిలో శిరీష స్పృహ కోల్పోతుండగా నిద్రిస్తున్న పిల్లలు లేచి అరవడంతో చుట్టుపక్కల వారు రావడంతో రాజశేఖర్ పారిపోయాడని తెలిపారు. అపస్మారక స్థితిలో చేరుకున్న శిరీషను వైద్యశాలకు తరలిస్తుండగా రెచ్చిపోయిన రాజశేఖర్ ఆటోను అడ్డగించి చంపేస్తానని భయభ్రాంతులకు గురి చేశాడని తెలిపారు. రాజశేఖర్ నుంచి తప్పించుకుని ఆర్ఎంపీ వైద్యుని వద్ద ప్రథమ చికిత్స అనంతరం వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూర్ గణేష్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఘటనపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

రైతుబంధు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేమూరు


మాట్లాడుతున్న ఎఎంసి చైర్మన్ పూర్ణ కమారి

రైతుబంధు పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఎంసి చైర్మన్ గుత్తిపాటి జయ వెంకట పూర్ణ కుమారి భాను గంగాధర్ తెలిపారు. స్థానిక ఎఎంసి కార్యాలయంలో కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. రైతుబంధు పథకం పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం యార్డులో పంటలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తుందని అన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎరువులు, పురుగు మందుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. అనంతవరం, ఇంటూరు, చదలవాడ గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గోదాములు మరమ్మతులు చేసేందుకు తీర్మానించారు. సమావేశంలో యార్డు కార్యదర్శి అజిత్ సింగ్, రేపల్లె ఎడిఎ లక్ష్మి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలో అడ్డంకులు సృష్టించి దళితులను అవమానకరంగా మాట్లాడిన బొబ్బేపల్లి సొసైటీ కార్యదర్శి కమ్మ మస్తాన రావుపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. విగ్రహం ఏర్పాటు చేయదలచిన స్థలాన్ని కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఎస్సీ కాలనీ ఎదురుగా ఉన్న కో ఆపరేటివ్ సొసైటీ పాడుబడిన భవనం సమీపంలో రోడ్డు మార్జిన్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు కాలనీవాసులు ఏర్పాట్లు చేస్తుండగా సొసైటీ కార్యదర్శి కమ్మ మస్తాన్రావు అవమానకరంగా మాట్లాడటంతో ఈ నెల 7న కాలనీవాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుడ్డు వీరయ్య, మాడుగుల వసంతరావు, చింతలపూడి ప్రేమ్ కుమార్, అనపర్తి రామారావు, జ్యోతి పోతులూరి, అల్లాడి ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

వర్షాలు లేక ఎండుతున్న పంటలు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పాపాయపాలెంలో ఎదపెట్టిన పొలాలు నీళ్లలేక బేట్టకు వచ్చి ఎండిపోతున్నాయి. శాస్త్రవేత్తలు పొలాలను బుధవారం సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డిఎఎటిటిసి సెంటర్ కోఆర్డినేటర్ అచ్చుత రాజ్, ఎడిఎ రత్నకుమారి, ఎఒ సరిత, విఎఎ స్వాతి పాల్గొన్నారు.

సంతమాగులూరు : ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండించుకోవాలని ప్రాజెక్టు మేనేజర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని ఏల్చూరు, సజ్జాపురం, పుట్టావారిపాలెం గ్రామాల్లో భూస ఆంజనేయులు, వీరారెడ్డి, దిండు సుబ్బారావు ఏర్పాటు చేసిన ప్రకృతి వనరుల కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎఒ షేక్ సైద, మాజీ సర్పంచి ఆంజనేయులు, శ్రీనివాసరావు, శిరీష పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

స్థానిక ఆర్‌జె ఎస్‌టి కాలనీ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త దేవరకొండ జ్యోతి ఆధ్వర్యంలో పోషణ కార్యక్రమం నిర్వహించారు. అప్పుడే పుట్టిన చిన్నారులకు తల్లిపాలు ఇవ్వటం వల్ల కలిగే ప్రయోజనాలు సూపర్వైజర్ శిరీష వివరించారు.

కనిగిరి : స్థానిక ఎన్జీఒ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై సూపర్‌వైజర్ సుమతి అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు పట్టించే ముర్రుపాలు బిడ్డకు వ్యాక్సిన్ కన్నా బాగా పనిచేస్తాయని తెలిపారు. అంగనవాడీ కార్యకర్త సుజాత, ఎఎన్ఎం దొరసానమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ల సమ్మెతో ఇబ్బందులు

ప్రజాశక్తి - కురిచేడు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు సమ్మె బాట పట్టారు. దానితో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విష జ్వరాలు, ఇతర వ్యాధులతో వైద్యం అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 32 గ్రామాల్లో జ్వరాలు ప్రబలి ప్రజలు బాధపడుతున్నారు. ఎన్ఎస్పి అగ్రహారంలో 10వ తరగతి విద్యార్థిని విష జ్వరంతో రెండు రోజుల క్రితం మృతి చెందింది. సకాలంలో వైద్యం అంది ఉంటే ప్రాణాపాయం ఉండేది కాదు. ప్రవేటు వైద్యశాలల్లో ఖర్చులు భరించలేక పేదలు ప్రాణాలు కోల్పోతున్నారు. వైద్యుల సమ్మె పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - పామూరు

పట్టణంలో ప్రధాన రోడ్లలో స్టాక్ గోడౌన్‌లు ఏర్పాటు చేయటం వలన టర్బో లారీలు వస్తే గోడౌన్‌లోకి పోవడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. సరుకు అరలోడు అయ్యేవరకు ట్రాఫిక్ సమస్య ఉంటుంది. టర్బో లారీ తిప్పుకోవడానికి డ్రైవర్ కుస్తి పట్టాల్సి వస్తుంది. స్థానిక శేషు మాల్ థియేటర్ పక్కనే ఉన్న చిన్న రోడ్డు లోకి టర్బో లారీ వెళ్లలేక డ్రైవర్ బుధవారం ఎంతో ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నది. వ్యాపారులు ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని గూడౌన్లు బయటి ప్రాంతంలో నిర్మించుకోవాలని, లేదా ట్రాఫిక్ లేని రాత్రి వేళల్లో లోడింగు, అన్‌లోడింగు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రహదారిపై ప్యాచ్ వర్క్‌తో లేచిపోయిన కంకర

నాణ్యత లోపంతో లేచిన కంకర

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు వెచ్చించింది. పనులు జరిపిస్తుండగా వాటిలో అధికారుల నిర్లక్ష్యంతో గుత్తేదారుల చేతివాటంతో పనులు నాణ్యత లోపభూ ఇష్టంగా ఉన్నాయి. భట్టిప్రోలు నుండి బ్రాహ్మణ కోడూరు వరకు వెళ్లే రహదారిలో చావలి వరకు అక్కడక్కడ గుంటలు ఏర్పడ్డాయి. ఆ రోడ్డుపై మాసికలు వేసేందుకు అధికారులు అంచనాలు రూపొందించారు. ప్రభుత్వానికి నివేదించగా దానికి అవసరమైన నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారిలో జరుగుతున్న ప్యాచ్ వర్క్ పనులు పూర్తి నాణ్యత లోకంగా జరుగుతున్నాయి. ప్రయాణికులకు ప్రాణ సంకటకంగా మారింది. భట్టిప్రోలు, కోడిపరు గ్రామాల మధ్య జరిగిన ప్యాచ్ వర్క్ పనుల్లో గుత్తేదారులు అతి తక్కువ మోతాదులో తారు వినియోగించడం వలన దానిలో వాడిన కంకర గులక పైకి లేచిపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ కంకర గులకపై ద్విచక్ర వాహనాలు వేగంగా వెళుతూ టైర్లు జారిపోయి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. తారు రోడ్డుపై ఉన్న కంకర గులక వేగంగా వెళ్లే వాకనాలకు జరిగిపోయి వాహనాలు జారి క్రిందపడి చోదకులు గాయాల పాలవుతున్నారు. అక్కడక్కడ గుంటలున్న ప్రాంతంలో ఏర్పాటు చేసి ప్యాచ్ వర్క్‌లో కూడా అవినీతి జరగటంతోనే ఈ విధంగా కంకర గులక పైకి లేచి ప్రమాదాలకు కారణం అవుతుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పంచాయతీకి సంబంధం లేదు

ప్రజాశక్తి - పంగులూరు

తమ స్థలంలోనే తాము గోడకట్టుకుంటున్నామని, కొంత మంది వ్యక్తులు కావాలని రాద్ధాంతం చేస్తున్నారని మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన మల్లె వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశంలో తూర్పుకొప్పెరపాడుకు చెందిన ఒక వ్యక్తి తాము పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి గోడకట్టుకుంటున్నట్లు మండల సమావేశంలో ఆరోపణ చేశారని ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని సర్వే నెంబరు 245లో వారసత్వంగా వచ్చిన 13సెంట్లు స్థలం తమకు ఉందని, దీన్ని గతంలోనే రెవెన్యూ అధికారులు పరిశీలించి పూర్తి హక్కుదారులుగా తమను ధృవీకరించారని పేర్కొన్నారు. ఆ స్థలంతో పంచాయతీకి ఎటువంటి సంబంధం లేదని అన్నారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్ పత్రాలు విలేకరులకు అందజేశారు. బీసీలైన తమను గ్రామంలో కొందరు బెదిరిస్తున్నారని, వాస్తవాన్ని వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.


పిల్లల సంరక్షణలో అంగనవాడీ కార్యకర్త శ్రీదేవి

అన్ని సౌకర్యాలతో అంగన్వాడి నిర్వహణ

ప్రజాశక్తి - పంగులూరు

పిల్లలకు పుష్టికరమైన ఆహారం, మంచి విద్య అందించడం వల్లనే తనకు జిల్లాస్థాయి అవార్డు వచ్చిందని మండలంలోని నూజిల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త కె శ్రీదేవి అన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. కేంద్రంలో పిల్లలు, బాలింతలు, గర్భవతులు, తల్లులకు సకాలంలో పుష్టికరమైన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారాలతో తాను ఈ అవార్డు సాధించగలిగానని సంతృప్తి వ్యక్తం చేశారు.

సిజెఐపై దాడికి ఎమ్మార్పీఎస్ నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తీవ్రంగా ఖండించింది. బుధవారం సంస్థ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ ఆధ్వర్యంలో సభ్యులు ఒంగోలులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలపై నేరుగా దాడి చేసినట్టేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేణుమాల మాధవ్ మాదిగ, రాజు మాదిగ, రావినూతల వెంకటేష్ మాదిగ, గౌడపేరు మహేష్ మాదిగ, పోనుగోటి ఉదయ్ కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై దాడి దళితుల గౌరవాన్ని అవమానపరిచే చర్యగా ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (ఐఎల్‌పి) రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం ఖండించారు. బుధవారం ఒంగోలు మంగమూరు రోడ్డులోని గాంధీనగర్ వద్ద అంబేద్కర్, పూలే, గౌతమ బుద్ధ విగ్రహాల వద్ద పార్టీ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు కలిసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి సంగీతరావు, పి. వెంకటేశ్వర్లు, జె. సుబ్బారావు, ఎస్‌కె. ఇర్ఫాన్, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి

సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ఒంగోలు నగరంలోని 33వ డివిజన్ సుందరయ్య నగర్ (వడ్డవానికుంట)లో పార్కు స్థలం నిర్లక్ష్యానికి గురైందని సిపిఎం నగర నాయకులు ఆరోపించారు. బుధవారం సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కాలనీలో పర్యటించారు. 60 గదుల స్థలాన్ని పార్కు కోసం కేటాయించినప్పటికీ, చిల్లచెట్లతో నిండిపోయి ఇబ్బందిగా మారిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే స్థానికులతో కలిసి పోరాటం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు సయ్యద్ హుస్సేన్, స్థానిక నాయకులు రావూరి శ్రీనివాసరావు, పెండ్రా శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

13 గంటల పని విధానంపై

కార్మిక వర్గాల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలుసిటీ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 8 గంటల పని చట్టాన్ని 13 గంటలుగా పెంచడం కార్మికవర్గానికి శరాఘాతమని పలువురు నేతలు ధ్వజమెత్తారు. బుధవారం సిఐటియు, ఎపి వ్యవసాయకార్మిక సంఘం, రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు సాగర్ హోటల్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, డివైయఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.యఫ్.బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు కనపర్తి సుబ్బారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం. రమేష్ మాట్లాడారు. కార్మికుల సమస్యలను, హక్కులను రక్షించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్మికులు, ఉద్యోగులు భవిష్యత్తులో ఐక్య పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి.శ్రీనివాసులు, పి.కల్పన, చీకటి శ్రీనివాసరావు, సి.హెచ్. చిరంజీవి, సిఐటియు నగర నాయకులు టి.మహేష్, బి.వి.రావు, జి.రమేష్ తంబి శ్రీనివాసులు, సిహెచ్ రాంబాబు, మున్సిపాలిటీ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, కుమారి, రవి, జి.శేషయ్య, టి.వి.సుబ్బారావు, కంకణాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌను తనిఖీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



ఈవీఎం గోడౌను తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఇంచార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలసి స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో భద్రపరిచిన ఈవీఎంల గోదామును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ ఈవీఎంల గోదాములను తనిఖీ చేయవలసి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, తహశీల్దార్ సలీమా, ఎలక్షన్ పర్యవేక్షకులు సఫీ అహ్మద్, ఎలక్షన్ డిటి శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్.కె.ఫారీద్ మస్తాన్, సిపియం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య, వైసీపీ నాయకులు మాల్యాద్రి పాల్గొన్నారు.